
నష్టం కొండంత సాయం గోరంత

అరుగాలం శ్రమించి పంటలు సాగు చేస్తున్న రైతన్నలకు వరుస వాయుగుండాలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ప్రతి ఏటా ఖరీఫ్ సీజన్‌లో పంట చేతికి వచ్చే వరకు నమ్మకం లేని పరిస్థితి నెలకొంది. పండించలేము.. అలా అని వదిలేయలేమన్న దీనస్థితికి రైతన్నల పరిస్థితి దాపురించింది. ఇటీవల ప్రకృతి విలయ తాండవంతో నిండా మునిగిన అన్నదాతలకు ప్రభుత్వం నుంచి సహాయం కూడా అంతంత మాత్రంగా ఉంది. అప్పులు చేసి పెట్టుబడులు పెట్టే పరిస్థితి లేక చాలా చోట్ల రైతన్నలు తమ పొలాలను కౌలుకు ఇచ్చే దుస్థితి నెలకొంది.


పాయకరావుపేట నియోజకవర్గంలో నీటమునిగిన వరి పంట(ఫైల్)

- వరుస వాయుగుండాలతో రైతుల కుదేలు
- ఇంకా పొలాల్లోనే వరద నీరు
- ఇప్పటి వరకు ఎకరాకు రూ.20 వేలు పెట్టుబడి
- పంట నష్టం కింద ఎకరాకు రూ.6,800 సిఫార్సు
- అన్నదాతలను ఆదుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం

నక్కపల్లి: ఈ ఏడాది రైతుల పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమయ్యాక వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో ఆగస్ట్ నెలాఖరు వరకు వరినాట్లు వేయలేదు. అడపాదడపా వర్షాలు పడిన సమయంలో నాట్లు వేసిన రైతులకు వరుస వాయుగుండాలు దెబ్బ తీశాయి. భారీ వర్షాల కారణంగా ఎగువ ప్రాంతాల్లో నుంచి వరదనీరు పెద్ద ఎత్తున ముంచెత్తడంతో వరినాట్లు మునిగిపోయాయి. ఈ నెల మొదటి వారంలో పది రోజుల వ్యవధిలోనే రెండు దఫాలుగా కురిసిన భారీ వర్షాలు వరి పంటకు తీవ్ర నష్టాన్ని కలగజేశాయి.


కుళ్లిన దుబ్బులను అధికారులకు చూపిస్తున్న రైతు


పంట నష్టాన్ని అంచనా వేస్తున్న అధికారులు

జిల్లాలో వరి సాధారణ విస్తీర్ణం 1,31,208 ఎకరాలు కాగా.. 1,21,130 ఎకరాల్లో వరి పంట వేశారు. ఈ నెలలో కురిసిన వర్షాలకు ప్రాథమిక సమాచారం మేరకు 2400 ఎకరాల్లో మాత్రమే వరి పంటకు నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనాలు తయారు చేసి, పరిహారం కోసం ప్రభుత్వానికి సిఫార్సు చేసినట్లు సమాచారం. పాయకరావుపేట నియోజకవర్గంలో మొత్తం వరి సాధారణ విస్తీర్ణం 23,435 ఎకరాలు కాగా.. 24,210 ఎకరాల్లో రైతులు వరి పంట వేశారు. ఈ నెలలో కురిసిన భారీ వర్షాలకు నియోజకవర్గంలో 1800 ఎకరాల్లో వరి పంట నీట మునిగిందని రైతులు చెబుతున్నారు. అధికారులు మాత్రం తమ బృందాలతో సర్వే చేయించామని, 414 ఎకరాల్లోనే పంట నీట మునిగి నష్టం వాటిల్లిందని చెబుతున్నారు. హెక్టారుకు రూ.17వేలు చొప్పున(ఎకరాకు రూ.6,800) నష్ట పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వానికి సిఫార్స్ చేస్తున్నామని ప్రకటన విడుదల చేయడంపై రైతులు మండి పడుతున్నారు.

నీటిలో వరి దుబ్బులు కుళ్లిపోతున్నాయి



ఇప్పటి వరకు ఎకరాకు రూ.20 వేలు వరకు పెట్టుబడి పెట్టాం. ఇంకా పొలాల్లో వరద నీరు నిల్వ ఉంది. దుబ్బులు కుళ్లిపోయే పరిస్థితి నెలకొంది. తాండవ ఆయకట్టు పొలాలతో పాటు, గోపాలపట్నం ఆవ ప్రాంతంలో ఉన్న సుమారు 600 ఎకరాలకు పైగా నీట మునిగిపోయింది. అధికారులు మాత్రం నష్టం చాలా తక్కువ అని ధ్రువీకరించడం సమంజసం కాదు. ఎకరాకు రూ.6800 నష్ట పరిహారం ఇవ్వడానికి సిఫార్సు చేయడం దారుణం. పొలాల్లో ఉన్న నీటిని తొలగించేందుకు చాలా ఖర్చు చేయాల్సి వస్తోంది. పురుగు మందులు కూడా రాయితీపై ఇవ్వడం లేదు. రైతు భరోసా మాట ఊసే లేదు. నష్టపోయిన రైతులకు నూరుశాతం పరిహారం చెల్లించాలి.

– తోట సత్యకిరణ్, రైతు, గుంటపల్లి

వరిసాగుకు పెట్టుబడి ఇలా..

వరిసాగు కోసం రైతులు పెట్టుబడి వివరాలు ఇలా ఉన్నాయి. విత్తనాల కోసం ఎకరాకు 30 కేజీలకు రూ.1,700, నారుమడి దుక్కుకు రూ.1000, దమ్ముకు రూ.3,500, ఎరువులు డీఏపీకి రూ.1,700, ఆకు తీతకు ఆరుగురు కూలీలకు రూ.4,200, వరినాట్లు వేయడానికి పది మంది కూలీలకు రూ.3,500, కలుపుతీతకు రూ.1000, రెండో సారి ఎరువులు వేయడానికి కూలీల ఖర్చు రూ.1000 ఖర్చు అవుతుంది. ఇక నుంచి మరో పర్యాయం ఎరువులు వేయడానికి రూ.1200, పంట చేతికి రావడానికి పది మంది కూలీలకు రూ.3,500లు, పొలాల్లో పనలు ఎండబెట్టేందుకు రూ.700, కోసిన పంట కుప్పవేయడానికి రూ.4,200, నూర్పులకు రూ.4,000 ఖర్చు చేయాల్సి ఉంటుందని రైతులు చెబుతున్నారు.

పంట రక్షణకు వ్యయ ప్రయాసలు

పంట నష్టం అంచనా అనేది సరిగా జరగడంలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా నక్కపల్లి, పాయకరావుపేట మండలాల్లో గొడిచర్ల, ఉద్దండపురం, దేవవరం, ఒడ్డిమెట్ట, చినరామభద్రపురం, నామవరం, గుంటపల్లి, గోపాలపట్నం, అరట్లకోట, మాసయ్యపేట, సత్యవరం, తదితర గ్రామాల పరిధిలో తాండవ ఆయకట్టు భూములు, గోపాలపట్నం ఆవ పొలాలు భారీగా వచ్చిన వరదనీటిలో మునిగిపోయాయి. ఈ నీటిని బయటకు పంపించి పంటలను కాపాడుకోవడం కోసం రైతులు అనేక వ్యయప్రయాసలు పడుతున్నారు. దుక్కులు, దమ్ములు మొదలుకుని ఇప్పటి వరకు ఎకరాకు రూ.20 వేలకు పైగానే పెట్టుబడి పెట్టారు. మరోవైపు ప్రస్తుతం కురిసిన వర్షాల కారణంగా పొలాల్లో చేరిన నీటిని బయటకు పంపేందుకు ప్రత్యేకంగా కూలీలతో పనులు చేపడుతున్నారు. ఇంత భారీ మొత్తంలో పెట్టుబడి పెడితే ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రభుత్వం అరకొర సాయమే అందిస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యధికంగా వరి పంటకు నష్టం వాటిల్లితే సర్వే బృందాలు మాత్రం నిబంధనలు సాకుగా చూపించి తక్కువ మొత్తంలో నష్టం జరిగినట్లు నివేదికలు తయారు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. సర్వే సమయంలో పొలాల్లో ఎక్కువ నీరు కనిపించకపోవడంతో 33 శాతం మాత్రమే నష్టం వాటిల్లినట్లు గుర్తిస్తున్నారని రైతులు చెబుతున్నారు. పంట నష్టం 60 శాతం పైనే ఉంటోందని అంటున్నారు. ప్రభుత్వం మాత్రం పంట నష్టానికి ఎకరాకు రూ.6800 మాత్రమే చెల్లిస్తుందని అధికారులు చెబుతున్నారని, ఇది చాలా దారుణమని వాపోతున్నారు. ఇప్పటి వరకు ఎకరాకు రూ.20వేలు పైనే పెట్టుబడి పెట్టామని, కనీసం 50 శాతం అయినా నష్టపరిహారం రూపంలో చెల్లించి ఆదుకోవాలని కోరుతున్నారు. గతేడాది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతు భరోసా కింద పెట్టుబడి సాయం రూపంలో మే నెలలోనే రూ.13,500 రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేసేదని రైతులు గుర్తు చేసుకుంటున్నారు. ఐదేళ్ల పాటు నిరాటంకంగా ఈ రైతుభరోసా సాయం అందడంతో పెట్టుబడులకు అప్పులు చేయాల్సి వచ్చేది కాదని అంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేక అన్నదాత పథకం కింద రైతుకు రూ.20 వేలు ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించిందని, ఇప్పటి వరకు పైసా కూడా విడుదల చేయకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


వరద నీటిని బయటకు పంపే పనుల్లో నిమగ్నమైన రైతులు

క్లుప్తంగా

ఘనంగా పసలమారమ్మ పండగ


పసలమారమ్మ ఊరేగింపులో గ్రామస్తులు

మునగపాక: మేజర్ పంచాయతీ మునగపాకలో ఆదివారం పసలమారమ్మ పండగ ఘనంగా జరిగింది. సాయంత్రం డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపు ఉత్సాహంగా సాగింది. అమ్మవారిని పలువురు భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. పంచాయతీ సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఉత్సవ కమిటీ చైర్మన్ వేగి కృష్ణ, పసలమారమ్మ సంఘం సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

దైవ చింతన అలవాటు చేసుకోవాలి


గణనాథుడిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక: ప్రతి ఒక్కరూ దైవ చింతన అలవాటు చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ కోరారు. మండలంలోని ఉమ్మలాడలో శ్రీబాలగణపతి యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహాన్ని ఆయన ఆదివారం దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవకాశం ఉన్నవారు తరచూ ఆలయాలను సందర్శించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, ఎంపీటీసీ మొల్లేటి కృష్ణవేణి నారాయణరావు, పార్టీ నేతలు మొల్లేటి శంకర్, సూరిశెట్టి రాము, సూరిశెట్టి శ్రీనివాసరావు, కరోతి విజయకుమార్, ఆడారి కాశీబాబు, మొల్లేటి నాయుడు, మొల్లేటి వినోద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఎస్.రాయవరం: కొరుప్రోలు సబ్ స్టేషన్ నుంచి బంగారమ్మపాలెం వెళ్లే రూట్‌లో అదనపు విద్యుత్ లైను ఏర్పాటు నేపథ్యంలో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని అనకాపల్లి ఈఈ రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. కొరుప్రోలు సెక్షన్‌లో గుడివాడ, గుర్రాజుపేట, లక్ష్మీపతిరాజుపేట, బంగారమ్మపాలెం, రేవుపోలవరం, కొత్తరేవుపోలవరం, తిమ్మాపురం, కొరుప్రోలు, గెడ్డపాలెం, వమ్మవరం, గోకులపాడు తదితర గ్రామాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

తోటాడ రోడ్డులో గోతుల పూడ్చివేత

మునగపాక: మండలంలోని తోటాడ రోడ్డులో పడిన గోతులను ఆదివారం పూడ్చారు. అనకాపల్లి జాతీయ రహదారి నుంచి తోటాడ వరకు ఉన్న రహదారిపై గోతులను పూడ్చేందుకు శ్రీకారం చుట్టినట్లు కూటమి నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పొలమరశెట్టి మురళి, దాడి రమణ బాబు, పీవీ సత్యనారాయణ, వెంకటేష్, బాల, రామసురేష్, గణేష్, వీరునాయుడు, వెంకటరావు, చినరాజు, జగ్గారావు, తదితరులు పాల్గొన్నారు.

పిచ్చి మొక్కలతో రాకపోకలకు అవస్థలు


చౌడువాడ రహదారిలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు

కోటవురట్ల: రహదారుల వెంబడి పెరిగిన పిచ్చి మొక్కలు ప్రమాదకరంగా మారాయి. మలుపుల్లో ఏపుగా పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలతో పిచ్చిమొక్కలు మరింత ఏపుగా పెరిగిపోయాయి. చౌడువాడ, అన్నవరం, లింగాపురం, నీలిగుంట రహదారులను ఈ పిచ్చిపొదలు కమ్మేశాయి. రోడ్లపైకి వాలిపోయి వాహనదారులను ఇక్కట్లకు గురిచేస్తున్నాయి. అధికారులు స్పందించి పిచ్చి మొక్కలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు.

కిసాన్ మహిళా మిత్ర సేవలను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న కిసాన్ మహిళా మిత్ర ఆర్గనైజేషన్ చైర్మన్ సురేష్

అచ్యుతాపురం(మునగపాక): రైతుల అభ్యున్నతి కోసం ఏర్పాటు చేసిన కిసాన్ మహిళా మిత్ర సేవలను సద్వినియోగం చేసుకోవాలని సంస్థ చైర్మన్ సురేష్ కోరారు. ప్రభుత్వ పథకాలు, రాయితీలు, మార్కెటింగ్ వంటి అంశాలపై ఆదివారం సంస్థ ఆధ్వర్యంలో మడుతూరులో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిసాన్ మహిళా ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ ద్వారా రైతులకు మేలు జరిగే కార్యక్రమాలు అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. సంస్థ సీఈవో రాజు మాట్లాడుతూ ఈ నెల 28, 29 తేదీల్లో అనకాపల్లిలో రైతు మేళా జరుగుతుందన్నారు. మోటూరు సంజీవ్, విశాఖ డెయిరీ పాల సంఘం అధ్యక్షుడు ఆనందరావు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పొలాల్లో ప్రమాదకరంగా విద్యుత్ తీగలు


పల్లపు ఆనందపురంలో ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు

మునగపాక: మండలంలోని పల్లపు ఆనందపురంలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. పొలాల్లో విద్యుత్ వైర్లు కిందకు వేలాడుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తోటల్లో పని చేసుకునే రైతులు ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని కలవరపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

నేటి నుంచి సీపీఎం రక్షణ యాత్ర


యాత్ర పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

అచ్యుతాపురం(మునగపాక): ఫార్మా కార్మికుల భద్రత కోసం సోమవారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు చేపట్టనున్న సీపీఎం రక్షణ యాత్రను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు కోరారు. ఈ మేరకు అచ్యుతాపురంలో యాత్ర పోస్టర్‌ను ఆయన ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాయకరావుపేట నుంచి పరవాడ వరకు మోటార్ సైకిల్ యాత్ర నిర్వహిస్తామన్నారు. 20న అచ్యుతాపురంలో 4 గంటలకు బహిరంగ సభ జరుగుతుందన్నారు. ప్రమాదాలు జరిగిన సమయంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు హడావుడి చేయడం తప్ప, కార్మికులకు భద్రత కల్పించడం లేదన్నారు. పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగాలు కల్పిస్తామంటూ ఇచ్చిన హామీలు అమలు కావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము, పార్టీ నాయకులు కర్రి అప్పారావు, సోమునాయుడు, చేపల తాతయ్య, ఆర్.లక్ష్మి, రామకృష్ణ, మంగతాయారు, గంగరాజు, అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వేద పాఠశాలలో లక్ష గరిక పూజ


వేద పాఠశాలలో పూజా క్రతువు నిర్వహిస్తున్న పురోహితులు


లక్ష గరిక పూజ అందుకున్న గణనాథుడు

యలమంచిలి రూరల్: పట్టణంలోని గౌడుజోగమాంబ వేద పాఠశాలలో వినాయక నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం గణపతి హోమం, లక్ష గరిక పూజ నిర్వహించారు. తొలుత యాగశాలలో హోమం చేసిన తర్వాత.. పూజా హాలులో ప్రతిష్ఠించిన మట్టి గణపతికి వేద పండితుడు శ్రీనివాస కులకర్ణి, పురోహితులు భాగవతుల సాయికుమార్, ఆకొండి సాయి శర్మ, కాలనాథభట్ల వెంకటేష్ శర్మ, ఆనివెళ్ల శ్రీనివాస్, వేద విద్యార్థులు లక్ష గరికల పూజా క్రతువును శాస్త్రోక్తంగా జరిపారు. పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు సతీ సమేతంగా ఈ క్రతువులో పాల్గొన్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేపట్టారు. గాయత్రీ సేవా ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు ఆచళ్ల వీరభద్రరావు, పెద్దింటి సూర్యనారాయణమూర్తి, పెన్ననర్ల సంఘం అధ్యక్షుడు చంద్రమౌళి సోమేశ్వరరావు, ట్రస్ట్ సభ్యులు భగవాన్, మణి పాల్గొన్నారు.

లడ్డూ @ 26 వేలు


సీతారామరాజునగర్‌లో వేలంలో దక్కించుకున్న లడ్డూ ప్రసాదంతో భక్తులు

కోటవురట్ల: గణేష్ నిమజ్జనోత్సవాల్లో భాగంగా పలు చోట్ల లడ్డూ ప్రసాదాన్ని వేలం వేశారు. చౌడువాడలో చిట్టిమాంబ యూత్ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. మండల కేంద్రంలోని సీతారామరాజునగర్‌లో శ్రీబాల వినాయక యూత్ ఆధ్వర్యంలో గణనాథుడిని ఊరేగింపు తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా లడ్డూ ప్రసాదానికి వేలం వేయగా.. సామాల వెంకట రాజగోపాల్ అనే భక్తుడు రూ.26 వేలకు దక్కించుకున్నారు.

ఏచూరి మృతి కార్మికులకు తీరని లోటు


రాంబిల్లిలో సీతారాం ఏచూరి చిత్రం పటం వద్ద నివాళులర్పిస్తున్న కార్మిక సంఘాల నాయకులు


రాంబిల్లి(యలమంచిలి): కార్మిక సంఘాలకు సీపీఎం అగ్రనేత సీతారాం ఏచూరి మరణం తీరని లోటని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడు నాయుడు అన్నారు. రాంబిల్లిలో ఆదివారం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతాల కోసం అహర్నిశలు ఏచూరి పని చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు భూపతి అప్పారావు, వై.శ్రీనివాసరావు, కె.వి.రమణ, వై.రాము, వై.సత్తిబాబు, సిహెచ్.రామకృష్ణ, చోడిపల్లి గంగరాజు, ధనరాజు, గణేష్, నూకరాజు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.


వరద బాధితుల కోసం నిత్యావసర వస్తువుల సేకరణ



విజయవాడ వరద బాధితుల కోసం సేకరించిన నిత్యావసర వస్తువులు

కశింకోట : స్థానిక హౌసింగ్ కాలనీకి చెందిన ముత్యాలమ్మ సేవా సమితి విజయవాడ వరద బాధితులకు బాసటగా నిలిచింది. ఇంటింటికీ తిరిగి 11 క్వింటాళ్ల బియ్యం, వస్త్రాలు, నగదుతో పాటు గోదుమ పిండి, కందిపప్పు, సేమియా, బిస్కెట్లు, తదితర సరకులను 80 కుటుంబాలకు సరిపడే విధంగా ప్యాక్ చేసి వెళ్లి పంపిణీ చేశారు. సమితి ప్రతినిధులు నూకాలమ్మ, శిష్టి రాజు, సంతోష్, మంగా రంజిత్, శ్రీనివాస్, వై. దర్శి, రమేష్, అమ్మిశెట్టి లక్ష్మణకుమార్ పాల్గొన్నారు.

వైభవంగా గణేష్ నిమజ్జనోత్సవాలు


రైల్వేస్టేషన్ రోడ్డులో గణేష్ శోభాయాత్రలో కోలాటమాడుతున్న మహిళలు


యాతపేటలో గణనాథుడి సన్నిధిలో వైఎస్సార్‌సీపీ నాయకులు


దేవవరంలో ముగ్గుల పోటీల విజేతలతో ఉత్సవ కమిటీ సభ్యులు


పాయకరావుపేటలో నిమజ్జనోత్సవంలో సందడి చేస్తున్న యువకులు

యలమంచిలి రూరల్: ఓ వైపు అన్నదాన కార్యక్రమాలు, మరోవైపు నిమజ్జన శోభాయాత్రలతో యలమంచిలి, పాయకరావుపేట నియోజకవర్గాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. యలమంచిలి మండలం, పట్టణ పరిధిలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. యాతపేటలో ఏర్పాటు చేసిన భారీ మట్టి గణనాథుడ్ని ఆదివారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ నేతలు దర్శించుకున్నారు. రైల్వే స్టేషన్ రోడ్డు, ప్రధాన రహదారి, రాంనగర్, సౌభాగ్య అపార్ట్‌మెంట్ సహా వివిధ ప్రదేశాల్లో వినాయక నిమజ్జనోత్సవాలు కోలాటాలు, నృత్య ప్రదర్శనలతో సందడిగా సాగాయి. స్థానిక పెంజెరువులో వినాయక ప్రతిమలను నిమజ్జనం చేశారు. పట్టణ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నక్కపల్లి: గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పలు గ్రామాల్లో నిర్వహించిన ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించింది. దేవవరంలో సీపీఎల్‌బీ యూత్ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. గణపతి ఆకృతిలో వేసిన ముగ్గు ఆకట్టుకుంది. విజేతలకు కమిటీ సభ్యులు బహుమతులు ప్రదానం చేశారు. నక్కపల్లి వీవర్స్ కాలనీలో ఉన్న వినాయక ఆలయంలో సరస్వతి పూజ నిర్వహించారు. వీవర్స్ కాలనీ, బండారుపేట, ఎస్సీ కాలనీ, ఉపమాక రోడ్డు ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఈ పూజలో పాల్గొన్నారు. సాయంత్రం గణనాథుడిని నిమజ్జనం చేశారు. ఉపమాకలో అన్నసమారాధన జరిపారు. ఇక్కడి స్వామికి డి.వెంకటేశ్వరరావు సోదరులు సమర్పించిన 10 కిలోల లడ్డూను వేలంలో దక్కించుకునేందుకు పలువురు పోటీ పడ్డారు. కాగిత, ఉద్దండపురం, గొడిచర్ల, ముకుందరాజుపేట, రమణయ్యపేట, దేవవరం గ్రామాల్లో గణేష్ నిమజ్జనాలు భారీ ఊరేగింపు నడుమ సాగాయి.


మునగపాకలో అన్న వర్థన చేస్తున్న శ్రీధర్మ ఫౌండేషన్ చైర్మన్ సాయికృష్ణ

ఒడ్డిమెట్టలో ముగిసిన ఉత్సవాలు

ఒడ్డిమెట్ట గణపతి నవరాత్రులు ముగిశాయి. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఒడ్డిమెట్ట, దేవవరం, నామవరం, గుంటపల్లి, చినరామభద్రపురం గ్రామాల్లో స్వామివారి ఉత్సవమూర్తులను ఊరేగించారు. అనంతరం మట్టి గణనాథుడి ప్రతిమను నిమజ్జనం చేశారు.

పాయకరావుపేట: పట్టణంలో గణేష్ విగ్రహాలను కేరింతలు, డాన్స్‌ల నడుమ నిమజ్జనం చేశారు. ట్రాక్టర్లపై గణేష్ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురం మండలంలో ఆదివారం గణనాథుని సన్నిధిలో భారీ అన్నసమారాధనలు నిర్వహించారు. ఎస్‌టీబీఎల్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ దర్శించుకున్నారు. ఆంజనేయ క్వార్టర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్న సమారాధనను ఆయన ప్రారంభించారు.


అచ్యుతాపురంలో అన్నసమారాధనలో పాల్గొన్న ఎమ్మెల్యే విజయకుమార్

ఎస్.రాయవరం: కొరుప్రోలు జగనన్న కాలనీలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు ఉత్సాహంగా పాల్గొని సత్తా చాటారు. కుమ్మరవీధిలో హరిభజన, వైఎస్సార్ కాలనీల్లో భారీ అన్న సమారాధన, ఊరేగింపు కార్యక్రమాలు సందడిగా సాగాయి.

మునగపాక: మునగపాకలో అన్నసమారాధనను శ్రీధర్మ ఫౌండేషన్ చైర్మన్ సాయికృష్ణ ప్రారంభించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి ప్రసాదం స్వీకరించారు.


కొరుప్రోలు జగనన్న కాలనీల్లో ముగ్గులు పోటీలు